క్లుప్తంగా

రాధాకృష్ణులకు 'పాల్వాయి' పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాంలోని విలేజ్ నంబర్ 4లో జరుగుతున్న అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో శనివారం రాత్రి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాధాకృష్ణులను దర్శించుకున్నారు. సనాతన హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఆయన వెంట నాయకులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లో గల రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివారం విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చి త్రపటం వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆకునూరి లక్ష్మీనారాయణ, కటుకొజ్వల వేణు, నూతి తిరుపతి, గుగ్గిళ్ల ర వీంద్రచారి, వీర రాజు, శ్రీనివాస్, రాజేందర్, రమణచారి, వెంకటేశ్వర్లు, రాజమౌళి పాల్గొన్నారు.

జన్నారంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జన్నారం మండలంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో రెండు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆ రెండు కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో ఆరుగురు సిబ్బందిని నియమించామని, మొత్తం జన్నారం మండలంలో 106మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు, ఓటర్లు శాంతియుతంగా ఓటింగ్ జరిగేలా సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్



దండేపల్లి: గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్‌లు నిరుపయోగంగా వదిలేస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేసి వర్మీకంపోస్టుగా తయారు చేయాలి. కానీ చెత్తను అందులో వేయకుండా రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో పడేసి దహనం చేస్తున్నారు. దీంతో చెత్తను వర్మీకంపోస్టుగా తయారు చేయాల్సిన కంపోస్టు షెడ్‌లు దండేపల్లి మండలంలో చాలా గ్రామాలో నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. దండేపల్లి మండలం మేదరిపేటలో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేయకుండా, దానిపక్కనే ఆరుబయట వేసి తగుల బెడుతున్నారు. దీంతో అక్కడ కంపోస్టు షెడ్ నిరుపయోగంగా మిగిలిపోయింది. తగులబెట్టిన చెత్తంతా గుట్టగా పేరుకుపోతోంది. అధికారులు స్పందించి కంపోస్టు షెడ్‌లు వినియోగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పగుళ్లు తేలిన బీటీ రోడ్డు



భీమారం: మండలంలోని పోలంపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు పగుళ్లు తేలడంతో ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీ య రహదారి నుంచి పోలంపల్లి గ్రామానికి చెరువు కట్ట మీద గుండా నిర్మించిన రోడ్డు ధ్వంసం కావడంతో బైక్‌లు, ఆటో ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు చేయకపోవడం వల్లే రోడ్డు దెబ్బతిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు ధ్వంసమై సంవత్సరం గడుస్తున్నా, కనీసం మరమ్మతు చేయడంలేదని తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని బీటీ రోడ్డులో పగళ్లు తేలిన చోట మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలు సిద్ధం

- నేడు ఓటింగ్
- అందంగా ముస్తాబైన కేంద్రాలు
- చేరుకున్న పోలింగ్ సిబ్బంది
- సౌకర్యాలు కల్పించిన అధికారులు



కెరమెరి: కెస్లాగూడలోని మోడల్ పోలింగ్ కేంద్రం

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని కెస్లాగూడను మోడల్ పోలింగ్ కేంద్రంగా ముస్తాబు చేశారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 41 పోలింగ్ కేంద్రాల్లో 23,684 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 12,006 ఉండగా, పురుషులు 11,678 ఉన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆయా కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

దహెగాంలో..

దహెగాం: మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. మండలంలో 26,078 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 13,014, మహిళలు 13,064 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు కోత్మీర్, ఇట్యాలలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండలంలోని లోహ, మొట్లగూడ, రావులపల్లి మారుమూల గ్రామాలు కావడంతో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఇట్యాలలో ఏర్పాటు చేశారు.

రెబ్బెనలో..

రెబ్బెన: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న ఓటింగ్ కోసం మండలంలో మొత్తం 47 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 37 కేంద్రాలు మాత్రమే ఉండగా తాజాగా అదనంగా మరో 10 తాత్కాలిక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. ఓట్లు వేసేందుకు కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. దివ్యాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. మండల కేంద్రంలోని 278 పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా నిర్వాహక పోలింగ్ కేంద్రాన్ని అందంగా ముస్తాబు చేశారు. ప్రధాన రహదారి నుంచి పోలింగ్ కేంద్రం వరకు శామియానాలు, టెంట్లు ఏర్పాటు చేయగా, కేంద్రం ముందు అందమైన పువ్వులు, కొబ్బరి ఆకులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు.



చింతలమానెపల్లి: ముస్తాబైన బాలాజీ అనుకోడ మోడల్ పోలింగ్‌స్టేషన్



చింతలమానెపల్లి: ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని బాలాజీ అనుకోడ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేయగా ఇక్కడి పోలింగ్ కేంద్రంలో అధికారులు ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిబ్బందిని నియమించి పోలింగ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు గౌడ్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు..

మండలంలోని పోలింగ్ ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఎంపీడీవో కోట ప్రసాద్ డబ్బా, రవీంద్రనగర్, చింతలమానెపల్లి, బాబాసాగర్, అడెపల్లి పోలింగ్ కేంద్రాలలో వసతులు పరిశీలించారు. మోడల్ పోలింగ్ కేంద్రం బాలాజీ అనుకోడను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకేంద్రంలో మహిళా నిర్వాహక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలాజీ అనుకోడ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, డీఎల్‌పీవో సురేశ్‌లు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు..

ఆదివారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులు, వర్షానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలింగ్ కేంద్రాలలో చీకటిలో ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. సిబ్బందికి సాయంత్రం భోజనం సైతం క్యాండిల్ దీపాల వెలుగులో ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పెంచికల్‌పేట్: మండలంలో ఎంపీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 21 పోలింగ్ కేంద్రాల్లో 12,296 మంది ఓటర్లు ఉన్నారు. మండలాన్ని నాలుగు రూట్లుగా విభజించి పోలింగ్ సజావుగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెంచికల్‌పేట్‌లోని ఆదర్శ పోలింగ్ కేంద్రం



చింతలమానెపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

పొంచి ఉన్న ప్రమాదం



చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

చింతలమానెపల్లి: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో గల బీసీ కాలనీలో సీసీ రహదారికి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి 20కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే వైర్ చేతికి అందే ఎత్తులో ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏటా పశువులు, మేకలు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాలీలు, ఆటోలు వంటి వాహనాలకు తాకే ఎత్తులో ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

మంచిర్యాలటౌన్: ప్రపంచ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధ మహిళలను రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, రజనీరెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, ఎడ్ల కిషన్, ఆశ్రమం నిర్వాహకుడు సదానందం, తిరుమల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ హరినామం



హాజరైన భక్తులు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్1 గ్రామంలోని రాధాశ్యాం సుందర్ మందిరంలో అఖండ హరినామ సంకీర్తన ఉత్సవాలు నిర్వహించారు. 9న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని రాధాకృష్ణుల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ నిర్వహించి కలశపూజ చేశారు. ఈనెల 10న ప్రారంభమైన హరినామ సంకీర్తన ఆలాపన 72గంటల పాటు నిరంతరంగా నిర్వహించారు. ఖోల్ మంగల్ ఆదివస్, నామయజ్ఞ సంకీర్తన్, మహా అన్నప్రసాద వితరణ, నగర కీర్తన, దదిమంగళ్ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన గీతాలాపన, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న బృందం

అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి



అమ్మవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. కోరుకున్న కోరికలు తీరాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అప్‌గ్రేడ్ చేయక అవస్థలు



గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- గూడెం పాఠశాలలో 8వ తరగతి వరకే క్లాసుల నిర్వహణ
- 9, 10వ తరగతి విద్యార్థులకు తప్పని దూరభారం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 9, 10వ తరగతులకు అప్‌గ్రేడ్ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పై చదువులకు ఇతర గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 10 సంవత్సరాల క్రితం ఇక్కడి పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ ఆ తర్వాత 9వ తరగతికి అప్‌గ్రేడ్ చేయకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు.

ఇతర గ్రామాలకు ప్రయాణం..

మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న శివపెల్లి, బూరుగూడ, కోయపెల్లి, దిందా, చిత్తామ గ్రామాలలో 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు మండల కేంద్రానికి లేదా కౌటాలలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. స్థానికంగా ఉన్నత విద్య లేకపోవడంతో ఆడపిల్లలను చదువు మాన్పించే పరిస్థితులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గూడెంతో పాటు రణవెల్లి, రుద్రాపూర్ గ్రామాలలో పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. మండలంలో ఇంటర్మీడియెట్ విద్య చదువుకునేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. ఏటా ఇక్కడి విద్యార్థులు ఇంటర్ విద్య కోసం కౌటాల, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

మండలంలోని గూడెం పాఠశాలను 10 సంవత్సరాల క్రితం ఉన్నత పాఠశాలగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అప్పటి సిబ్బంది పాఠశాలలో 10వ తరగతిని ఏర్పాటు చేయడానికి అవసరమైన నిబంధనలు పాటించకపోవడంతో ఉత్తర్వులు నిలిచిపోయాయి. దీనికి తోడు పాఠశాల పోలీస్‌స్టేషన్‌కు దూరంగా ఉందని, పీజీస్థాయి ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు లేరనే కారణాలతో పాఠశాలలో 9, 10వ తరగతులను అప్పటి అధికారులు మంజూరు చేయలేదు. పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతుల నిర్వహణకు సరిపడా వసతులు ఉన్నాయి. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ స్థాయి ప్రధానోపాధ్యాయుడు విధులు నిర్వహిస్తుండగా, పీజీ హెచ్‌ఎం పోస్ట్ కూడ మంజూరైంది. అయినా ఉన్నతాధికారులు మాత్రం అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో మరికొన్ని ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలి



గూడెం గ్రామంలోని ఉన్నత పాఠశాలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి. విద్యార్థులు ప్రతీరోజు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకోవాలి.

– బుర్రి రూపేశ్, విద్యార్థి సంఘం నాయకుడు, గూడెం

నివేదికలు అందించాం

గూడెం గ్రామంలో 10వ తరగతి వరకు తరగతుల నిర్వహణకు గతంలో చాలాసార్లు నివేదికలు అందించాం. ఆర్‌జేడీ కార్యాలయం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఈఏడాది కూడా నివేదిక అందజేస్తాం.

– సోమయ్య, ఎంఈవో

గాలివాన బీభత్సం



పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద విరిగిన చెట్టు కొమ్మ

జిల్లాకేంద్రంతో పాటు కౌటాల, ఆసిఫాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల కరెంట్ తీగలు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలోని తుంపెల్లి గ్రామానికి చెందిన పాలవేణి భీరయ్య ఇంటిపై చెట్టు విరిగి పడింది. భార్యాభర్తలు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నారు. కానీ అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. – ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కౌటాల



జిల్లా కేంద్రంలోని పిల్లల పార్కు వద్ద గాలిదుమారంతో ఎగిరిపడిన టేల



తుంపెల్లిలో ఇంటిపై పడిన చెట్టు

కార్మికులకు ఓటు వేసే అవకాశం కల్పించాలి

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు పూర్తి వేతనంతో కూడిన సెలవును ఇచ్చి కార్మికులు స్వేచ్ఛగా ఓటు వేసేలా యాజమాన్యాలు అవకాశం కల్పించాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల కు సెలవు దినం ప్రకటించకపోతే వారి అ మూల్యమైన ఓటును వినియోగించుకోలేక పోతారని, ఇందుకోసం జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.